# దావత్ ఇచ్చారు..
# ధాన్యం దక్కించుకున్నారు.!

శెనార్తి మీడియా, మంచిర్యాల :



- బకాయిదారులకే మళ్లీ ధాన్యం కేటాయింపు
- రికవరీ కాని పాత బకాయిలు
- గ్యారంటీ ఇవ్వకున్నా తిరిగి అనుమతించడంపై సందేహాలు
- పంతం నెగ్గించుకున్న ఓ మిల్లర్
- తనకు ఎలా కేటాయించరో చూస్తానంటూ ఇటీవల సవాల్
- రైస్ మిల్లర్లలో జోరుగా చర్చ

అంతా అనుకున్నట్లుగానే జరిగింది. వారం క్రితం మిల్లరంతా ఆ శాఖ అధికారులకు దావత్ ఇచ్చారని మీడియాలో కథనాలు వచ్చినా అధికారులు మౌనం పాటించారు. కానీ ఇప్పుడు రూ. కోట్లలో బకాయిలు ఉన్న వారికే ధాన్యం కేటాయించడంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అధికారుల వైఖరి చర్చనీయాంశమవుతున్నది.

జిల్లాలో బకాయిలు ఉన్న రైస్ మిల్లులకే మళ్లీ ధాన్యం కేటాయిస్తున్నారు. బకాయితోపాటు బ్యాంకు గ్యారంటీ ఇవ్వకుం డానే ధాన్యం తరలిపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే ముప్పు తిప్పలు పెడుతున్న రైస్ మిల్లర్లు సీఎంఆర్ ఏ మేరకు ఇస్తారనే సందేహాలు లేకపోలేదు.

ఈ యాసంగి సీజన్ కొనుగోలు కేంద్రాల నుంచి గత నెల 29వరకు 11 రైస్ మిల్లులకు ట్యాగింగ్ ఇచ్చారు. అదే నెల 30న మరోసారి ఐదు మిల్లులకు ట్యాగింగ్ వచ్చింది. ఈ ఐదింటిలో నాలుగు గతంలో ధాన్యం దించుకుని సీఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్) ఇవ్వని, యాక్షన్ ధాన్యానికి సంబంధించి పెండింగ్ బకాయి చెల్లించనివి ఉండడం గమనార్హం. సీఎంఆర్ పెండింగ్లో ఉన్నా ధాన్యం కేటా యించడంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

జిల్లాలో 2022-23 యాసంగి నుంచి 2023-24 వానకాలం సీజన్లో సీఎంఆర్ ధాన్యం తీసుకుని రూ.కోట్ల విలువైన బియ్యం ఇవ్వకుండా, యాక్షన్ ధాన్యానికి సంబంధించిన డబ్బులు చెల్లించకుండా పౌరసరఫరాల శాఖ అధికారులను ముప్పు తిప్పలు పెడుతున్నారు కొందరు మిల్లర్లు. వీరికి సీఎంఆర్ కేటాయించొద్దని, బ్లాక్ లిస్టులో పెట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. నోటీసులు సైతం జారీ చేసింది. జిల్లాలో ఒకరిద్దరిపై ఆర్ఆర్ యాక్టు క్రిమినల్ కేసులు కూడా నమోదు చేశారు. కానీ ఇటీవల పలువురు మిల్లర్లు దొడ్డిదారిన సీఎంఆర్ కేటాయింపులు చేసుకుంటున్నారు. జన్నారం, హాజీపూర్, మందమర్రి ప్రాంతాల్లో బ్లాక్ లిస్టులో ఉన్న పూర్తి స్థాయిలో బకాయి చెల్లించని మిల్లర్లకు ధాన్యం కేటాయించడం అధికారుల వైఖరిని తేటతెల్లం చేస్తున్నది. జిల్లాలో ఇంకా బాయిల్డ్ రైస్ మిల్లులు ఉన్నా బకాయిలు చెల్లించకపోవడంతో ధాన్యం కేటాయించలేదు. కొన్నింటికి మాత్రమే నాలుగు రోజుల క్రితం అనుమతి వచ్చింది.

### ఎట్ల కేటాయించరో చూస్తా..!

సీఎంఆర్ కేటాయింపులకు అనర్హులుగా గుర్తించిన వారు తిరిగి ధాన్యం దక్కించుకునేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. కొద్ది రోజులుగా రాష్ట్ర కమిషనరేట్, కలెక్టరేట్ అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. ఓ మిల్లర్ అయితే ఏకంగా తనకున్న పలుబడితో ఎలా కేటాయించరో చూస్తానని సవాల్ చేసి మరీ దక్కించుకున్నాడని కొందరు రైస్ మిల్లర్లు గుసగుసలాడుకుంటున్నారు. పెద్ద పెద్ద మిల్లర్లు కొందరు మూలకు పడిన, వివిధ కారణాలతో ఆగిన మిల్లులను అద్దెకు తీసుకుని ధాన్యం కేటాయింపులు జరిగేలా ప్రయత్నాలు చేస్తున్నారు. గతంలోనూ కొందరు అక్రమార్కులు ఇదే పద్ధతిలో కేటాయింపులు చేయించుకున్న సంఘటనలు సైతం లేకపోలేదు. కొందరు అధికారుల సహకారం వల్లే కేటాయింపులు జరిగినట్లు, గతంలో మిల్లర్లు పరస్పరం ఫిర్యాదు చేసుకున్నారు.

హాజీపూర్, బెల్లంపల్లి మండలాల్లో రెండు రైస్ మిల్లులు అద్దెకు తీసుకొని ఓ మిల్లు యజమాని గతంలో సీఎంఆర్ ధాన్యం తీసుకుని బియ్యం ఇవ్వకుండా రూ. కోట్లలో ప్రభు త్వానికి మొండి చేయి చూపడంతో క్రిమినల్ కేసు నమోదై జైలుకు కూడా వెళ్లారు.

### వసూలు కాని బకాయిలు రూ.85కోట్లు

2022-23 సీజన్లో గోదాముల్లో నిల్వ చేసిన ధాన్యానికి తాము ఎందుకు నగదు చెల్లించాలని, మిల్లు పేరిట కేటాయించి ధాన్యం తీసుకోకపోయినా నగదు చెల్లించాలనడం ఏమిటని కొందరు మిల్లర్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో కొంత వెసులుబాటు కల్పించినట్లు తెలుస్తున్నది. జిల్లాలో బాయిల్డ్ రైస్ మిల్లులు 19, రా రైస్ మిల్లులు 35 ఉన్నాయి. రెండు సీజన్ల సీఎంఆర్ ఇవ్వకపోవడం, తనిఖీల్లో ధాన్యం నిల్వలు లేకపోవడాన్ని గుర్తించిన విషయం తెలిసిందే . సీఎంఆర్, యాక్షన్ ధాన్యానికి సంబంధించి రూ.138.78 కోట్లు చెల్లిం చాల్సి ఉంది. ప్రస్తుతం యాసంగి సీజన్ ధాన్యం దక్కించుకునేందుకు ట్యాగింగ్ కోసం అధికారులపై ఒత్తిడి తీసుకు వచ్చినట్లు తెలుస్తున్నది. ఓ మిల్లర్ రూ.11కోట్ల మేర బకాయి ఉన్నా తన పలుకుబడితో పాటు కొంత నగదు చెల్లించి ట్యాగింగ్ తెచ్చుకున్నట్లు సమాచారం. కొందరు గత నెల 21న బకాయిల్లో 10 నుంచి 30శాతం చెల్లించి మిగతా బకాయిలు వారం పది రోజుల్లో చెల్లించేందుకు ఒప్పందం చేసుకున్నట్లు సమాచా రం. ఇంకా రూ.85 కోట్లు బకాయి వసూలు కావాల్సి ఉంది. ఇందు లో ఒక మిల్లు బకాయి మొత్తం చెల్లించ గా.. నాలుగు మిల్లులు రూ.కోట్లలో పెం డింగ్ లో ఉన్నాయి. మరోవైపు బ్యాంకు గ్యారంటీ సైతం ఇవ్వలేదు. నిబంధనల ప్రకారం బకాయిలు లేని మిల్లులు పది శాతం గ్యారంటీ, పాత బకాయి మరో 20శాతం అదనంగా బ్యాంకు గ్యారంటీ ఇవ్వాల్సి ఉంటుంది. ఇప్పటి వరకు బ్యాం కు గ్యారంటీ లేకుండానే ధాన్యం కేటాయింపులు సాగుతున్నాయి.





# కబ్జా కోరల్లో ఇటిక్యాల చెరువు

శెనార్తి మీడియా, మంచిర్యాల (లక్షెట్టిపేట) :

- ఎమ్మెల్యే పీఎస్సార్ కు విన్నవించిన నాయకులు
- ఇన్ని రోజులు ఏం చేశారంటూ అసహనం
- సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వీడియోలు

లక్షెట్టిపేట పట్టణంలోని ఇటిక్యాల పెద్ద చెరువులో మట్టి తవ్వకాల పేరుతో కొందరు ఇరిగేషన్ అధికారులు రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అండగా నిలుస్తున్నారు. ప్రభుత్వానికి సీనరేజ్ టాక్స్ పేరిట నామమాత్రపు చలాన్లు కట్టి కొందరు మట్టిని నిబంధనలకు విరుద్ధంగా తరలిస్తుంటే అధికారులు పట్టించుకోవడం లేదని సీపీఐ ఎంఎల్ నాయకులు, చెరువు పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో మత్స్య కారులు రెండు రోజుల క్రితం ఆందోళన చేపట్టారు. ఈ నెల ఒకటో తేదీ నుంచి మట్టి తవ్వకాలకు అనుమతులు ఉంటే గత నెల 27 నుంచే తవ్వకాలు మొదలు పెట్టినట్లు ఆరోపించారు. చెరువు ఎఫ్టీఎల్, బఫర్ జోన్లను నిర్ధారించకుండా ఇరిగేషన్, రెవెన్యూ అధి కారులు రియల్ ఎస్టేట్ వ్యాపారులతో మిలాకత్ అయి చెరువును చెరపడుతు న్నా రని మండిపడ్డారు.

### చెరువు మట్టితో కెనాల్ పూడ్చివేత

గంపలపల్లి నుంచి వచ్చే ఇరిగేషన్ కెనాల్ ను ఇటిక్యాల చెరువులోని నల్లమట్టితో రియల్ ఎస్టేట్ వ్యాపారులు పథకం ప్రకారం పూడ్చివేస్తున్నారు. ఇరిగేషన్ నిబంధనల ప్రకారం, కెనాల్ ను పూడ్చివేయడం లేదా ధ్వంసం చేయడం విరుద్ధం కానీ ఇదే చెరువులో తీసిన మట్టిని గొలుసుకట్టు విధానం ద్వారా గంపలపల్లి చెరువు నుంచి చేరే వరద నీటిని అడ్డుకోవడానికి రియల్ ఎస్టేట్ వ్యాపారాలు స్కెచ్ వేశారు. ఇప్పటికే కొంత భాగం కెనాల్ ను చెరువు మట్టితో పూడ్చివేశారు. ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు రియల్ ఎస్టేట్ వ్యాపారుల లంచాలకు మరిగి ఎఫ్ టీ ఎల్, బఫర్ జోన్ లను గుర్తించడం లేదని నాయకులు ఆరోపించారు. మట్టి మాఫియా రాత్రి, పగలు తేడా లేకుండా టిప్పర్లతో మట్టిని నిబంధనలకు విరుద్ధంగా తరలిస్తున్నారు. ఇటుక బట్టిలకు మట్టి పేరుతో చెరువు లోని మట్టిని తవ్వి అదే చెరువుకు నీరు వచ్చే ప్రధాన కెనాల్ ను మూసివేసే పనిలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు నిమగ్నమయ్యారు. ఇటిక్యాల చెరువులో మట్టి తవ్వకాలు చేస్తూ ఇటుక బట్టీలకు తరలించకుండ వేరే ప్రాంతాలకు మట్టిని తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని సీపీఐ ఏంఎల్ న్యూ డెమోక్రసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీనివాస్, మండల కార్యదర్శి దొండ ప్రభాకర్, చెరువు పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో కన్వీనర్ సప్ప రవి, మత్స్య కారులు ఆందోళన చేపట్టారు. ముఖ్యంగా రియల్ ఎస్టేట్ మాఫియా ప్రోద్భలంతో చెరువు హద్దులు మాయమయ్యేలా మొరం, మట్టితో చెరువును నింపివేస్తున్నారని మండిపడ్డారు. అంతకుముందు ప్రభుత్వ ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తో కలిసి ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు సందర్శించారు. మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావును చెరువు కబ్జాపై ప్రశ్నించగా, ఇన్ని రోజులు గుట్టలు, చెరువులు మాయం చేస్తుంటే ఏం చేశారు..? ఇప్పుడు మీకు కమీషన్లు ఇవ్వకపోవడంతో ప్రశ్నిస్తున్నారా? మొరం, గుట్టలను ఆక్రమిస్తే ఇన్ని రోజులు ఏం పీకారు అని పరుష పదజాలంతో మత్స్యకారులు, సీపీఎం నాయకులపై ఎమ్మెల్యే విరుచుకుపడ్డారు.

### అధికార పార్టీ నాయకుల హస్తం



ఇటిక్యాల చెరువు కబ్జాలో అధికార పార్టీ కాం గ్రెస్ నాయకుల హస్తం ఉంది. ఎఫ్టీఎల్, బఫర్లను గుర్తించకుండా అధికారులను అడ్డుకుం టున్నది ఎవరూ? కెనాల్‌ను మట్టితో రియల్ ఎస్టేట్ వ్యాపారులు నింపుతున్న కూడా ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదు? ఇప్పటికైనా సరైన చర్యలు చేపట్టకపోతే ఆందోళనలు చేస్తాం.

- దొండ ప్రభాకర్, సీపీఐ ఏంఎల్ న్యూ డెమోక్రసీ నాయకుడు

# అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

శెనార్తి మీడియా, మంచిర్యాల:

జిల్లా కేంద్రంలో పలు అభివృద్ధి పనులకు ఆది వారం మంచిర్యాల శాసన సభ్యులు కొక్కిరాల ప్రేం సాగర్ రావు, జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల సంక్షేమం కోసం, జిల్లా అభివృద్ధిలో భాగంగా అనేక ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. రహదారుల నిర్మాణం ద్వారా మంచిర్యాల పట్టణంలో ఎలాంటి ట్రాఫిక్ సమస్య ఉండదని తెలిపారు. మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ ను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, మంచిర్యాల పట్టణాన్ని అన్ని హంగులతో ఆధునికరించడం జరుగుతుందని తెలిపారు. పట్టణ ప్రజలకు ట్రాఫిక్ సమస్య లేకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అనంతరం మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వార్డ్ నెంబర్ 9 రంగపేట, వార్డ్ 17 బృందావన కాలనీ, వార్డ్-4 రాజరాజేశ్వర కాలనీ, రోడ్ నెంబర్ - 17 సూర్య నగర్, వార్డు 3 లలో సి సి రహదారులు, మురుగు కాలువల పనులను ప్రారంభించారు. హమాలివాడలోని హనుమాన్ ఆలయం సమీపంలో సిసి రహదారి, వార్డ్- 1 గాంధీనగర్ లో బిటి రహదారుల పనులను ప్రారంభించారు.అలాగే గాంధీనగర్ నుంచి రాజీవ్ నగర్ వరకు రూ. 3. 58 కోట్లతో టియుఎఫ్ఐడిసి నిధులతో బిటి రహదారి నిర్మాణానికి, రహదారులు భవనాల శాఖ ఆధ్వర్యంలో మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఐబి చౌరస్తా నుండి శ్రీనివాస గార్డెన్ వరకు హైదరాబాద్-కరీంనగర్- చాందా రహదారి పై 251/9 నుంచి 255/7 వరకు రూ. 16.6 కోట్ల వ్యయంతో 6 వరుసల బిటి రహదారి నిర్మాణానికి శంకుస్థాపనలు చేశారు. ఈ కార్యక్రమాలలో రోడ్లు భవనాల శాఖ ఈఈ భవర్ సింగ్, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శివాజీ లతో పాటు మాజీ ప్రజా ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.





# నిరుపేదలకే ఇందిరమ్మ ఇండ్లు

శెనార్తి మీడియా, కరీంనగర్ :

- పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక
- ఎంపికలో రాజకీయ జోక్యం లేదు
- గ్రామాల్లో లబ్ధిదారుల పేర్లను డిస్ ప్లే చేయాలి
- రెండు నెలల్లో రెండో విడత ఎంపిక..
- రాని వారు నిరాశ చెందవద్దు
- గత పదేళ్లలో ఏ గ్రామానికి డబుల్ బెడ్ రూం రాలేదు..
- ఇప్పుడు ఊరూరికి ఇస్తున్నాం
- గ్రామాల్లో అందరూ కూర్చొని సయోధ్య కుదుర్చుకోవాలి
- అనర్హులకు ఎంపిక చేస్తే చర్యలు : మంత్రి పొన్నం

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన ఇందిరమ్మ ఇళ్లు ..ఇల్లు లేని నిరుపేదలకు అర్హులుగా ఎంపిక చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మొదటి విడత ప్రతి నియోజకవర్గంలో 3500 ఇళ్ల చొప్పున లబ్ధిదారుల ఎంపిక జరుగుతుందని ఎవరైనా అనర్హులకు ఇందిరమ్మ ఇళ్లు వస్తే తమ దృష్టికి తీసుకురావాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక లో అవినీతి ఆస్కారం జరిగి అనర్హుల ఎంపిక చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఒకటికి రెండు సార్లు పరిశీలించిన తరువాత ఇందిరమ్మ ఇళ్లు లబ్ధిదారుల ఎంపిక జరగాలని పేర్కొన్నారు. అధికారులు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను పేర్లను గ్రామాల్లో డిస్ ప్లే చేయాలని ఆదేశించారు.

గత పది సంవత్సరాల్లో ఏ గ్రామానికి డబుల్ బెడ్ రూమ్ రాలేదని, ఇప్పుడు ఇందిరమ్మ ఇల్లు ప్రతి గ్రామానికి వస్తున్నాయని హర్షం వ్యక్తం చేశారు. ఇళ్లు రాని వారు నిరాశపడాల్సిన అవసరం లేదని రెండు నెలల్లో రెండవ విడత ఇందిరమ్మ ఇల్ల లబ్ధిదారుల ఎంపిక ప్రారంభమవుతుందని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక లో గ్రామాల్లో సయోధ్య లేక ఇబ్బందులు పడవద్దని గ్రామాల్లో అందరూ కూర్చొని అర్హతలో అతిపెదవాడికి ఇల్లు రావాలని అధికారులను మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు.

# నీట్ పరీక్ష ప్రశాంతం..



శెనార్తి మీడియా, కరీంనగర్ :

జిల్లాలో నీట్ పరీక్ష ప్రశాంతం గా నిర్వహించామని, ఈ మేరకు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టామని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పేర్కొన్నారు. ఆదివారం కరీంనగర్ బైపాస్ రోడ్ లో తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ కాలేజీ, ఎస్ ఆర్ ఆర్ కాలేజీలో నీట్ పరీక్ష కేంద్రాలను జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఆయా చోట్ల ఎంత మంది విద్యార్థులు పరీక్ష రాస్తున్నారు.. ఏర్పాట్లు పకడ్బందీగా చేశారా.. ఏమైనా ఇబ్బందులు తలెత్తాయా... పరీక్ష కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించారా... అని అధికారుల నుంచి కలెక్టర్ వివరాలు సేకరించారు. విద్యార్థులు పరీక్ష కేంద్రానికి సమయానికి చేరుకున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు పరీక్ష కేంద్రాల్లోకి వెళ్లే ముందు బయోమెట్రిక్ హాజరు, రిజిస్ట్రేషన్, తనిఖీ చేపట్టిన ప్రక్రియ గురించి తెలుసుకున్నారు. జిల్లా కలెక్టర్ గదుల్లోకి వెళ్లి పరీక్ష తీరు.. వసతుల కల్పనను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నీట్ పరీక్షకు ఏడు కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. జిల్లాలో 2975 మందికి 2914 మంది నీట్ పరీక్షకు హాజరయ్యారని, 61 మంది విద్యార్థులు హాజరు కాలేదని పేర్కొన్నారు. నీట్ పరీక్ష జిల్లాలో ప్రశాంతంగా జరిగేలా ప్రత్యేక చర్యలు తీసుకున్నామని, ఈ మేరకు పకడ్బందీ చర్యలు చేపట్టామని తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఐదు గంటల వరకు పరీక్ష జరిగిందని చెప్పారు. ప్రతి పరీక్షా కేంద్రానికి ఒక నోడల్ అధికారిని నియమించామన్నారు. కలెక్టర్ వెంట నెహ్రూ యువ కేంద్ర కోఆర్డినేటర్ రాంబాబు, ఎస్ ఆర్ ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ, తహసిల్దార్ రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

### అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ పరిశీలన ..

అదేవిధంగా స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ వివిధ నీట్ పరీక్ష కేంద్రాలను ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బందితో ప్రత్యేకంగా వసతుల కల్పన.. విద్యార్థుల హాజరు తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. సీసీ కెమెరాల పనితీరును పర్యవేక్షించారు. అన్ని వివరాలను తెలుసుకున్నారు. పోలీసుల భద్రత..విద్యార్థుల బయోమెట్రిక్, తనిఖీలు.. వివిధ అంశాలను కనుక్కున్నారు. ఎక్కడా ఏలాంటి తప్పిదాలు జరగకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని అధికారులకు అడిషనల్ కలెక్టర్ సూచిం చారు. నీట్ పరీక్ష జిల్లాలో ప్రశాంతంగా సాగిందని అడిషనల్ కలెక్టర్ పేర్కొన్నారు.